నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తనున్నాయని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ కార్తీకవనం ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దూలపల్లి వీకర్‌సెక్షన్ కాలనీ, అయ్యప్ప కాలనీ, గంగాస్థాన్, కార్తీక వనం, ఫారెస్ట్ అకాడమీ, ఐజాంట్ పరిశ్రమ.

◆ కొంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం, ఆంధ్ర బస్తీ, సెంట్రల్ పార్క్ ఏరియాల్లో విద్యుత్ ఉండని ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..

◆ సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎంఎన్ రెడ్డినగర్ ఫేజ్–2, సాయిబాబానగర్, న్యూమాణిక్యనగర్, పద్మానగర్ ఫేజ్–2, వాజ్‌పేయినగర్, నాగులకుంట, దత్తాత్రేయనగర్,

◆ మీనాక్షి ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలోని స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, మీనాక్షి ఎస్టేట్స్, అంగడిపేట్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేట్‌బషీరాబాద్ ఏఈ పేర్కొన్నారు.

బహదూర్‌పల్లి ఫీడర్ పరిధిలో...

దుండిగల్: బహదూర్‌పల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బౌరంపేట ఏఈ సాయికిరణ్ తెలిపారు. సాయినాథ్ సొసైటీ, బహదూర్‌పల్లి ప్రధాన రోడ్డు, రాయల్ ఓక్స్ పరిసర ప్రాంతాలు, అదే విధంగా మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రణీత్ ఫ్లోర్, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో..

జగద్గిరిగుట్ట: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జగద్గిరిగుట్ట ఏఈ రాధాకిషన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జగద్గిరిగుట్ట ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జగద్గిరిగుట్ట, బీరప్పనగర్, అంజయ్యనగర్, మైసమ్మనగర్, సోమయ్యనగర్.

◆ ఐడీపీ జగద్గిరిగుట్ట, వెంకటేశ్వరనగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3గంటల వరకు దేవమ్మబస్తీ, బీరప్పనగర్, పాపిరెడ్డినగర్, సంజయ్‌పురి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో...

సుభాష్‌నగర్: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని గాజులరామారం ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీవెన్ ఎన్‌క్లేవ్, ఓక్షిత ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, దేవభూమినగర్, ఆదర్శనగర్, మెట్‌కానిగూడ, పెద్దమ్మ నగర్, కృష్ణమహాలక్ష్మినగర్, శారద కాలనీ, చిత్తారమ్మ ఆలయ పరిసర ప్రాంతం, సోమిరెడ్డి వెంచర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డ్యాన్స్, యోగాలో చిన్నారులకు శిక్షణ

సమ్మర్ క్యాంపులపై తల్లిదండ్రుల మక్కువ



గాజులరామారంలోని ఓ స్కూల్లో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా డ్యాన్స్ నేర్పిస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: వేసవి సెలవులు ఉండటంతో స్కూళ్లలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లకు పిల్లలను పంపించడానికి విద్యార్థుల తల్లిదండ్రులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. గాజులరామారం ప్రాంతానికి చెందిన డాన్స్ మాస్టర్ పవన్‌సింగ్ ఆధ్వర్యంలో 10 స్కూళ్లలో డ్యాన్స్ క్లాసెస్, యోగా నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు సెల్‌ఫోన్‌లకు అలవాటు పడకుండా డ్యాన్స్, ఇతర ఆటలపై వారిని మళ్లించాలని తమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సెల్‌ఫోన్ అతిగా వాడితే ఎదురయ్యే సమస్యల గురించి, క్రమశిక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

పగలు.. లైట్ల వెలుగులు



వెంకటాద్రినగర్‌లో వెలుగుతున్న లైట్

జీడిమెట్ల: పగలే వెన్నెల అంటే ఇదేనేమో.. పట్టపగలు ఓ వైపు సూర్యుడు భగభగ మండుతుంటే... కొన్ని కాలనీల్లో మాత్రం వీధి దీపాలు వెలుగుతున్నాయి. సిబ్బంది ఆపివేయడం మర్చిపోతున్నారు. కాలనీవాసులైనా ఉదయం విద్యుత్ లైట్లు ఆపివేస్తే విద్యుత్‌ను పొదుపు చేసిన వాళ్లమవుతాం.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో పోలింగ్ అత్యల్పం

- కుత్బుల్లాపూర్ సెగ్మెంట్ పరిధిలో 50.19 శాతం పోలింగ్
- నియోజకవర్గంలోని 62 కేంద్రాల్లో కేవలం 40శాతం ఓటింగ్
- అందులో నిజాంపేట్ కార్పొరేషన్‌లోని 41 పోలింగ్ కేంద్రాలు ఉండటం గమనార్హం



రంగారెడ్డినగర్: ఇటీవల ముగిసిన మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో పలు పోలింగ్ కేంద్రాల్లో అత్యల్పంగా ఓటింగ్ శాతం నమోదైంది. దీంతో పోలింగ్ శాతంపై దీని ప్రభావం కనిపించింది. ఇది ఎక్కువగా కాలనీ ప్రాంతాల్లో కనిపించగా, మరికొన్ని చోట్ల బస్తీల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భారీ క్యూలైన్లు కనిపించగా, మరికొన్ని చోట్ల పట్టుమని పది మంది కూడా లైన్లలో నిలుచున్న దాఖలాలు లేవు. కుత్బుల్లాపూర్ సెగ్మెంట్ పరిధిలోని 592 పోలింగ్ బూత్‌లు ఉండగా 50.19 ఓటింగ్ నమోదైంది. 62 పోలింగ్ కేంద్రాల్లో పట్టుమని 40 శాతం ఓటింగ్ సైతం జరగలేదు. అందులో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో 41 పోలింగ్ కేంద్రాలు ఉండటం గమనార్హం.

జీహెచ్‌ఎంసీ పరిధిలో..

◆ జీహెచ్‌ఎంసీ పరిధిలో 425 పోలింగ్ బూత్‌లు ఉండగా 34 కేంద్రాల్లోనే 60 శాతానికి పైబడి పోలింగ్ జరిగింది. 228 కేంద్రాల్లో 50 శాతం పోలింగ్ జరిగింది.

◆ సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోని ఫాదర్స్ మోడల్ హైస్కూల్‌లో అత్యధికంగా 65.81 శాతం పోలింగ్ జరిగింది. 971 మంది ఓటర్లకు గాను 639 మంది తమ ఓటును వినియోగించుకున్నారు.

◆ భగత్‌సింగ్‌నగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లోని బూత్ నం. 409లో అత్యధికంగా 65.75 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 1095 ఓటర్లు ఉండగా 720 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

◆ చంద్రగిరినగర్‌లోని నిస్సీ స్వాతి హైస్కూల్‌లోని బూత్ నం. 371లో 64.42 శాతం పోలింగ్ జరిగింది. 1026 ఓటర్లకు గాను 663 మంది ఓటు వేశారు. అదే విధంగా బూత్ నం. 370లో 63.78 జరుగగా 1005 ఓటర్లకు గాను 641 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

◆ గాజులరామారం సీఎంఆర్ మోడల్ హైస్కూల్‌లోని బూత్ నం. 302లో 64.55 శాతం పోలింగ్ జరిగింది. 866 మంది ఓటర్లకు గాను 559 మంది ఓటు వేశారు.

◆ చెరుకుపల్లి కాలనీలోని మదర్ థెరిస్సా స్కూల్‌లోని బూత్ నం. 47064.16) శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 876 మంది ఓటర్ల ఉండగా 562 మంది ఓటు వేశారు.

◆ కైసర్‌నగర్ ఎంపీపీఎస్‌లోని బూత్ నం. 260లో 63.54 ఓటింగ్ జరిగింది. 1001 మంది ఓటర్లకు గాను 636 మంది ఓట్లు వేశారు.

◆ జగద్గిరినగర్‌లోని ఎంపీపీఎస్‌లోని బూత్ నం. 393 63.21) శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 927 మంది ఓటర్లకు గాను 586 మంది ఓటింగ్ చేశారు.

◆ మెట్‌కానిగూడ ఎంపీపీఎస్‌లోని బూత్ నం. 256లో 63.04 పోలింగ్ జరిగింది. 1093 ఓటర్లకు గాను 689 మంది ఓటు వేశారు.

40 శాతం దిగువున పోలింగ్ జరిగిన బూత్‌లు ఇవే..

◆ షాపూర్‌నగర్ ఎంపీపీఎస్ స్కూల్ బూత్ నం. 231 (36.68), టీఎస్‌ఐఐసీ మా హైస్కూల్‌లో బూత్ నం. 281(36.31), నెహ్రూనగర్ ఎంపీపీఎస్ బూత్ నం. 282 (36.90), రాజీవ్‌గాంధీనగర్ గీతాంజలి హైస్కూల్‌లో బూత్ నం. 284 (37.44), మగ్దూమ్‌నగర్ శ్రీసాయి విద్యానికేతన్‌లోని బూత్ నం. 356 (39.96), చింతల్ సెయింట్ మార్టిన్ హైస్కూల్‌లోని బూత్ నం. 418 (34.10), పాపయ్యయాదవ్‌నగర్‌లోని రెయిన్‌బో స్కూల్‌లోని బూత్ నం. 447(38), 448 (32.98), 449 (35.76), 450 (33.31), ప్రసూననగర్‌లోని సిద్ధార్థ హైస్కూల్‌లో బూత్ నం. 457(37.51), పద్మానగర్ ఫేజ్–2లోని మెహర్‌సాయి విద్యానికేతన్‌లోని బూత్ నం. 468 (39.51), 482 (38.16), చింతల్ సిద్ధార్థ హైస్కూల్ బూత్ నం. 483 (38.76), సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్ హై స్కూల్‌లో బూత్ నం. 531 (39.84), సుభాష్‌నగర్ ఎంపీపీఎస్ బూత్ నం. 534 (35.77), 535 (35.99), సాయిబాబానగర్ బ్లూమింగ్ బడ్స్ కాన్వెంట్‌లో బూత్ నం. 542 (38.26).

దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల్లో భేష్..

◆ దుండిగల్ మున్సిపల పరిధిలో 46 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 14 కేంద్రాల్లో 60 శాతం, 19 బూత్‌లలో 50 శాతం పోలింగ్ జరిగింది. నాగులూరు ఎంపీపీఎస్‌లోని పోలింగ్ బూత్ నం. 13లో అత్యధికంగా 80.31 పోలింగ్ జరిగింది. ఈ బూత్‌లో మొత్తం 640 మంది ఓటర్లు ఉండగా 514 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా దుండిగల్ జడ్పీహెచ్‌ఎస్ పోలింగ్ బూత్–12లో 71.42 శాతం, దుండిగల్ ఎంపీపీఎస్ బూత్ నం. 6లో 71.25, బౌరంపేట్ జడ్పీహెచ్‌ఎస్‌లోని పోలింగ్ బూత్ నం. 38లో 70.20 శాతం పోలింగ్ జరిగింది.

◆ దూలపల్లి మున్సిపల్ పరిధిలో 25 పోలింగ్ బూత్‌లు ఉండగా 3 చోట్ల 60 శాతం, 19 చోట్ల 50 శాతం పోలింగ్ జరిగింది. దూలపల్లి ఎంపీపీఎస్‌లోని పోలింగ్ బూత్ నం. 52లో 67.85 శాతం, దూలపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లోని బూత్ నం. 47లో 67.81 శాతం, బూత్ నం. 50లో 62.68 శాతం ఓటింగ్ నమోదైంది.

అతి తక్కువ పోలింగ్ శాతం ఇక్కడే..

◆ బాచుపల్లిలోని సిల్వర్ ఓక్స్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్ నం. 79లో 847 మంది ఓటర్లు ఉండగా కేవలం 238 మంది మాత్రమే ఓటు వేశారు. ఇక్కడ 28.10 శాతం ఓటింగ్ నమోదైంది.

◆ నిజాంపేట్ రాజధాని స్కూల్‌లోని పోలింగ్ బూత్ 155లో 1335 మంది ఓటర్లు ఉండగా 391 మంది మాత్రమే ఓటు వేశారు. దీంతో ఈ బూత్‌లో 29.29 శాతం పోలింగ్ జరిగింది.

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో

బూత్ నంబర్ల వారీగా పోలింగ్ శాతం

72(39.61),	81(34.51),	96 (35.81),	99(33.91),	102(33.84),	103(37.23),
108(39.23),	109(38.59),	110(38.33),	111(35.21),	112(34.35),	113(39.78),
114(35.91),	115(37.92),	116(35.47),	117(37.71),	118(35.75),	119 (36.61),
120(32.74),	121(33.08),	124(39.66),	130(37.88),	133(39.78),	136(39.19),
138(38.61),	140(38.61),	143(39.31),	146(38.72),	147(36.59),	148(39.02),
149(33.19),	150(36.48),	151(39.14),	152(39.31),	153(38.85),	154(34.06),
156(37.41),	157(33.12),	158(36.51),	159(39.40),	164(38.92).	

లీజుకు తెస్తాడు.. ఆ తర్వాత అమ్మేస్తాడు!

- నాలుగు వాహనాలను రికవరీ చేసిన పోలీసులు
- రిమాండ్‌కు నిందితుడు శ్యామ్



వాహనాలను రికవరీ చేసి నిందితుడు శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సుభాష్‌నగర్: దళిత బంధు పథకం కింద వచ్చిన వాహనాలను లీజుకు తీసుకుని మోసానికి పాల్పడిన వ్యక్తిని సూరారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లికి చెందిన కనిగిరి శ్యామ్(33) డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కాగా గాజులరామారం లాల్‌సాబ్‌గూడకు చెందిన పపులోల్ల భిక్షపతి, మద్దెల యాదగిరి, దాసరి పోచమ్మ, బొడ్డు రమేష్‌లకు దళిత బంధు పథకం కింద వాహనాలు మంజూరు కాగా. వారి నుంచి శ్యామ్ నెలకు రూ.13వేల అద్దెకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని వాహనాలు తీసుకున్నాడు. ఆరు నెలల పాటు అద్దె సక్రంగా చెల్లించిన శ్యామ్ ఆ తరువాత కనబడకుండా పోయాడు.

◆ దీంతో అనుమానం వచ్చిన వాహనదారులు విచారించగా సదరు వాహనాలను విక్రయించినట్లు తెలుసుకున్నారు. ఈ విషయమై భిక్షపతి సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దీంతో నిందితుడు శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా మోసానికి పాల్పడినట్లు అంగీకరించాడు. భిక్షపతి వాహనాన్ని మహమ్మద్ ఆసిఫ్ అనే వ్యక్తికి రూ.3.2 లక్షలకు, యాదగిరి వాహనాన్ని మహ్మద్ నయీంకు రూ.2.30 లక్షలకు, రమేష్‌కు చెందిన వాహనాన్ని బాలయ్య అనే వ్యక్తికి రూ.4.30 లక్షలకు, దాసరి పోచయ్య వాహనాన్ని పర్వేజ్‌ఖాన్‌కు రూ.60 వేలకు విక్రయించినట్లు వెల్లడైంది. దీంతో పోలీసులు సదరు వాహనాలను కొనుగోలుదారుల నుంచి రికవరీ చేసి నిందితుడు శ్యామ్‌ను రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు.. అధికారులకు ఫిర్యాదులు



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బైరి ప్రశాంత్‌గౌడ్

కుత్బుల్లాపూర్: రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ కోరారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డు విజయ్ సింహ లేఅవుట్‌లో రోడ్డును అక్రమంగా సుమారు 500 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తెలిపారు. కొన్ని సంవత్సరాల పాటు నివాసం ఏర్పర్చుకోగా సదరు స్థలంలో హోటల్‌ను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, పూర్ణచందర్‌రావు, ప్రభాకర్ గుప్తా పాల్గొన్నారు.

తెలంగాణలో ఇంజినీరింగ్ విద్య అందని ద్రాక్ష

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

జగద్గిరిగుట్ట: తెలంగాణలో ఇంజినీరింగ్ విద్య అందని ద్రాక్షగా మారుతోందని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. కొంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యకు డొనేషన్ల రూపంలో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌కు రూ.10–20 లక్షలు డొనేషన్ వరకు యాజమాన్యం వసూలు చేస్తోందన్నారు. దీని వల్ల పేదలు చదువుకునే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. విద్యాశాఖ అధికారులు దీనిపై స్పందించి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొని రావాలని తెలిపారు. రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేడవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి, మేడ్చల్ జిల్లా బీసీ ఐక్య వేదిక కోఆర్డినేటర్ నిఖిల్ పాల్గొన్నారు.

పసికందు చికిత్సకు రూ.80వేల ఆర్థికసాయం

మానవత్వం చాటుకున్న క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు



పపసికందు తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: నెలల నిండకుండా పుట్టిన పసికందు వైద్య ఖర్చులకు క్షత్రియ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. పత్సమట్ల శ్రీనివాస్, సత్యభార్గవి దంపతులకు నెలలు నిండకుండా పసికందు పుట్టడంతో ఎస్‌సీఎల్ సౌత్‌లోని పారామిత చిన్నపిల్లల ఆస్పత్రిలో ఈనెల 20వ తేదీన అడ్మిట్ చేశారు. కాగా పసికందుని 15 నుంచి 20 రోజుల పాటు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉంచాలని వైద్యులు పేర్కొన్నారు.

◆ అయితే శ్రీనివాస్ చిరుద్యోగి కావడంతో అంత మొత్తంలో డబ్బులు వెచ్చించే స్తోమత లేకపోవడంతో బీజేపీ నియోజకవర్గ కో–కన్వీనర్ శివాజీ రాజు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన కూకట్‌పల్లికి చెందిన క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లగా సోమవారం అసోసియేషన్ సభ్యులు తమవంతు సహాయంగా రూ.80 వేలను పసికందు కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ ఈ సందర్భంగా శివాజీ రాజు మాట్లాడుతూ.... ఎన్నో సంవత్సరాలుగా క్షత్రియ యూత్ ఫెడరేషన్ సభ్యులు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ పేదల మన్నన పొందుతూ వస్తున్నారని అన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వందలాది మంది ప్రాణాలను కాపాడాలని కొనియాడారు. క్షత్రియ యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు నడింపల్లి సుధీర్ వర్మ, సురేష్ వర్మ, మాధవ్ తదితరులు ఉన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: నవ భారత నిర్మాత జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అనేక డ్యామ్‌లు నిర్మించిన ఘనత నెహ్రూకే దక్కుతుందన్నారు. తొలి ప్రధానిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, జేమ్స్, డివిజన్ల అధ్యక్షులు ప్రవీణ్, మల్లికార్జున్, లాయక్, రమేష్, శ్రీశైలంయాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కుటీర పరిశ్రమలో స్వల్ప అగ్నిప్రమాదం



మంటల్లో కాలిపోయిన అల్యూమినియమ్ షీట్లు, వస్తు సామగ్రి

రంగారెడ్డినగర్: గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతం సీఐఈ గాంధీనగర్‌లో సోమవారం మధ్యాహ్నం ఓ పరిశ్రమలో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సీఐఈ గాంధీనగర్ ప్లాట్ నం.6లోని భవనం మొదటి అంతస్తులో అల్యూమినియం ఫ్యాబ్రికేషన్ పనులు చేపట్టే ఒక కుటీర పరిశ్రమలు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీనిని గమనించిన యజమాని నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశాడు. మంటలు ఆర్పే క్రమంలో పరిశ్రమ యాజమాని పట్టుతప్పి కింద పడటంతో చేయి విరిగింది. దీంతో అతడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పరిశ్రమ యజమాని అప్రమత్తతతో మంటలు వ్యాపించకుండా పెను ప్రమాదం తప్పింది.

వృద్ధుడి అదృశ్యం



బాలస్వామి (ఫైల్)

దుండిగల్: ఆస్పత్రిలో ఉన్న భార్యను చూసేందుకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న 60 గజాల ప్రాంతంలో బాలస్వామి(65) తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతని భార్య అనారోగ్యానికి గురికావడంతో దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో చేర్పించారు. బాలస్వామి తన భార్యను చూసేందుకు ఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

మల్కాజిగిరి ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

- హోలీమేరీ కాలేజీలో ఐదు నియోజకవర్గాల కౌంటింగ్
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్, వెస్లీ కాలేజీలో కంటోన్మెంట్

సాక్షి,మేడ్చల్ జిల్లా: వచ్చే 4వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్ ఏఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో మేడ్చల్, మల్కాజిగిరి, త్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఆర్వోలతో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని గౌతమ్ అన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన చర్యలపై ఏఆర్వోలకు ఆయన పలు సూచనలు చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి 28 టేబుళ్లు, మల్కాజిగిరి 20, కుత్బుల్లాపూర్ 28, కూకట్‌పల్లి 20, ఉప్పల్ 20, ఎల్‌బీనగర్ 28, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హోలీమేరీ కాలేజీలో ఐదు

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కీసర మండలంలోని భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్బీనగర్, వెస్లీ కాలేజీలో సికింద్రాబాద్ నియోజకవర్గాల ఓట్ల కౌంటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మాత్రం హోలీమేరీ కాలేజీలో నిర్వహిస్తామన్నారు. ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హాల్లో టేబుల్స్, సీసీ కెమెరాలు, విద్యుత్, ఇంటర్నెట్, ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి టీ, స్నాక్స్, భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్ రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, ఏడు నియోజకవర్గాల ఏఆర్వోలు, ఎలక్షన్ సెల్ విభాగం అధికారి రాజేశ్వర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



'హోలీమేరీ'లో ఏర్పాట్ల పరిశీలన

సాక్షి,మేడ్చల్ జిల్లా: భోగారం హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను సోమవారం ఎన్నికల అధికారి గౌతమ్, రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషితో కలిసి పర్యవేక్షించారు. లోక్‌సభ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ఏర్పాట్లకు అవసరమైన పలు సూచనలు, సలహాలను సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రతీ కౌంటింగ్ సెంటర్‌లో సీసీ కెమెరా, కరెంటు, ఇంటర్నెట్, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ పద్మజ, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలు పేరుకుపోకుండా.. వరద నిలవకుండా చర్యలు



డ్రైనేజీ లైన్లు శుభ్రం చేసే పనులను పరిశీలిస్తున్న సీజీఎం శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఈ



పనులను పరిశీలిస్తున్న జలమండలి ఆపరేషన్ డైరెక్టర్ స్వామి

చింతల్: సుచిత్ర సర్కిల్ నేషనల్ హైవే రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలు, వరద నీరు నిలుస్తున్న ప్రాంతాలను సోమవారం జలమండలి, జోనల్ అధికారులు సందర్శించారు. నేషనల్ హైవే సుచిత్ర సర్కిల్ వద్ద రోడ్డుపై పారుతున్న మురుగు, నాలాలను జలమండలి ఆపరేషన్ డైరెక్టర్ స్వామి, రెవెన్యూ సీజీఎం శ్రీధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ చిన్నారెడ్డి తదితరులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. అదే విధంగా డ్రైనేజీ వ్యర్థాలు తీసే జెట్టింగ్ మిషిన్ల వద్ద పనిచేస్తున్న కార్మికుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వాటర్ వర్క్స్ డీజీఎంలు విజయం, రాజేష్, సెక్షన్ మేనేజర్లు తదితరులు ఉన్నారు.